బోనం కాంప్లెక్స్ ఆవరణలో దుర్వాసన

- బల్కంపేట ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో మేకలు, గొర్రెల కసరు
- వారానికి రెండు సార్లు మాత్రమే తొలగింపు
- ప్లాస్టిక్ డ్రమ్ముల్లో కుళ్లిపోతున్న వ్యర్థాలు
- భక్తులు, చిరువ్యాపారుల అవస్థలు
- పట్టించుకోని ఆలయ నిర్వాహకులు


దుర్వాసన వెదజల్లుతున్న ప్లాస్టిక్ డ్రమ్ముల్లోని కసరు

అమీర్‌పేట, మే 17(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం బోనం కాంప్లెక్స్ ఆవరణలో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో భక్తులు, స్థానికులు, చిరు వ్యాపారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అమ్మ వారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు మేకలు, గొర్రెలు, కోళ్లను కోయించుకుని బంధువులు, స్నేహితులతో కలిసి బోనం చేస్తారు. ఇక్కడ నిత్యం జాతరను తలపించేలా ఉంటుంది. గొర్రెలు, మేకలు, కోళ్ల వ్యర్థాలు, కసరును మాత్రం ఎప్పటికప్పుడు తొలగించకుండా వారానికి రెండు సార్లు మాత్రమే తొలగిస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసిన కసరు మురిగిపోయి ఆలయ పరిసరాల్లోకి దుర్వాసన వస్తోంది.

గత మంగళవారం నుంచి నిల్వ చేసిన మురుగు వ్యర్థాలు, కసరును శుక్రవారం జీహెచ్ఎంసీ వాహనంలోకి ఎత్తి వేస్తున్నప్పుడు మురిగిపోయిన కసరు రోడ్డుపై పారుతుండడంతో భక్తులు, చిరు వ్యాపారులు ముక్కు మూసుకుని ఊపిరి బిగపట్టాల్సిన దుస్థితి నెలకొంటోంది. ఈ విషయపై పలుమార్లు ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. ఆలయం సమీపంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రిని విక్రయించేందుకు వందకు పైగా స్టాళ్లు కూడా ఉన్నాయి. వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.


బోనం కాంప్లెక్స్ నుంచి మేకలు, గొర్రెల కసరును తీసుకెళ్తున్న జీహెచ్ఎంసీ వాహనం

దుర్వాసనను భరించలేకపోతున్నాం



బోనం కాంప్లెక్స్ ఆవరణలో ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేస్తున్న మూగ జీవాల కసరు నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నాం. వారానికి రెండుసార్లు మాత్రమే తొలగిస్తుండడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. వ్యర్థాలు తొలగిస్తున్నప్పుడు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో ఉన్న కసరు రోడ్డుపై పారుతున్నప్పుడు వచ్చే వాసనకు ఊపిరి సలపనివ్వడం లేదు. ఆలయ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి.

- మల్లీశ్వరి, బొమ్మల వ్యాపారి

రోగాల బారిన పడుతున్నాం



బోనంకాంప్లెక్స్ ఆవరణలో రోజుల తరబడి నిల్వ చేస్తున్న వ్యార్థాల నుంచి వచ్చే దుర్వాసనకు రోగాల బారిన పడుతున్నాం. ఈ వ్యర్థాలను తొలగిస్తున్న రోజు మాత్రం తమ షాపులను బంద్ చేసి ఇంటికి వెళ్లిపోతున్నాం. రోడ్డుపై పడుతున్న కసరు వాసన రెండు రోజుల పాటు వస్తోంది. ఈసమస్య పరిష్కారానికి ఆలయ అధికారులు దృష్టి సారించి ఎప్పటికప్పుడు వ్యార్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

- కడవారి క్రిష్ణ, కిరాణం షాపు నిర్వాహకుడు


మట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ మధుసూధన్‌రెడ్డి

సంస్కృతిని బలోపేతం చేయడమే లక్ష్యం

అల్వాల్, మే 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతిని బలోపేతం చేయడంతో పాటు ఆయా రాష్ట్రాల్లో నివసిస్తున్న ప్రజల మధ్య పరస్పర సంబంధాలను పోత్సహించడమే 'ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో మే 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేషనల్ కెడెట్స్ కార్ప్స్ (ఎన్‌సీసీ) శిక్షణకు 600మంది ఎన్‌సీసీ కెడెట్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ డైరెక్టరేట్‌ల నుంచి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణలోని వివిధ ఆచారాలు, సంప్రదాయాలు, భాషను రాజస్థాన్ ఎన్‌సీసీ కెడెట్స్ తెలుసుకోవడానికి దోహదపడుతుందన్నారు. రాజస్థాన్‌లో తాను పని చేశానని, అక్కడి అనుభవాలను ఆయన కెడెట్స్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్ కమోడోర్ రాజస్థానీ భాషలో కొన్ని వాక్యాలు మాట్లాడడంతో రాజస్థాన్ నుంచి వచ్చిన కెడెట్స్ హర్షం వ్యక్తం చేశారు.


డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రారంభిస్తున్న ఓయూ వీసీ రవీందర్

ఓయూ ఆర్ట్స్ కాలేజీలో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ప్రారంభం

తార్నాక, మే 17 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ బోర్డుల ద్వారా విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో పాఠాలు బోధించాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం ఓయూ వీసీ డా. రవీందర్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, టెక్నాలజీ విద్యార్థులతో పాటు ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులకు కూడా డిజిటల్ క్లాస్‌రూమ్‌ల సౌకర్యాన్ని కల్పించామన్నారు. విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో అంతర్జాతీయ స్థాయిలో బోధించేందుకు డిజిటల్ బోర్డులు ఎంతో తోడ్పడుతాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. అర్జున్ రావు కుతాడి, ఓఎస్డీ ప్రొ. రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి సంపద


జస్టిస్ ఏకే మిశ్రా చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న విద్యార్థిని

పటాన్‌చెరు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): యువతే దేశానికి సంపద అని, వారు దేశ సమగ్రత, సానుభూతి, నైతిక నాయకత్వ సూత్రాలకు కట్టుబడి ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్ పర్సన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా అన్నారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ రెండో పట్టాల ప్రదానోత్సవ (గ్రాడ్యుయేషన్ డే) వేడుకను శుక్రవారం గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని కిన్నెర సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ అరుణ్‌కుమార్ మిశ్రా పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. పబ్లిక్ పాలసీ ద్వారా న్యాయం, ధర్మం, ఉమ్మడి ప్రయోజనాలు కొనసాగించాలని, యువత తీసుకునే నిర్ణయాలు, వారు సమర్థించే విధానాలు, చర్యలు అసంఖ్యాక వ్యక్తుల జీవితాలపై తీవ్ర ప్రభావాలను కలిగి ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథిని సత్కరించారు. కౌటిల్యా డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ ముఖ్య అతిథిని పరిచయం చేశారు. గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు కేఎస్ పీపీ విద్యార్థి అర్చన గుప్తాకు ప్రతిజ్ఞను అందజేయగా, ఆమె విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య అతిథి నుంచి పట్టాను అందుకున్న వారి పేర్లను కేఎస్ పీపీ డీన్ ప్రకటించారు. గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ అధికారిక ధ్రువీకరణలపై ఉప కులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సంతకం తీసుకున్నారు. ఈ పట్టాల ప్రదానోత్సవంలో 25 మంది కేఎస్ పీపీ విద్యార్థులు స్నాతకోత్తర (పీజీ) డిగ్రీలను, అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వారు బంగారు పతకాలను అందుకున్నారు.

మద్యం మత్తులో కారు భీభత్సం

- పాలమ్మే వ్యక్తులపై దూసుకెళ్లగా.. ఒకరు మృతి, మరొకరికి గాయాలు

మాదాపూర్, మే 17(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు.. ఆపై నిర్లక్ష్యపు డ్రైవింగ్. మరోవైపు నిద్ర మత్తులో అతివేగంతో కారు నడపడంతో దారుణం జరిగింది. రోడ్డుపక్కన పాలు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న వ్యక్తులపై కారు దూసుకెళ్లడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం మాదాపూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ మెగా హిల్స్‌కు చెందిన దారు శ్రీనివాస్ (35) పాల వ్యాపారి. తనకు అవసరమైన పాలను తీసుకెళ్లడానికి మదాపూర్‌లోని హనుమాన్‌నగర్ మెయిన్ రోడ్డుకు ఆటోలో వచ్చాడు. రోడ్డు పక్కన టాటా ఏస్ పాల వాహనంతో (టీఎస్08యూజె4463) రాఘవులు నిలబడ్డాడు. శ్రీనివాస్, రాఘవులు పాలు లోడింగ్ చేస్తుండగా.. రాజేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో కోయా కార్నివాల్ (టీఎస్9ఎఫ్ఎస్4499) కారును శుక్రవారం తెల్లవారుజామున అతివేగంగా నడుపుతూ.. హైటెక్ సిటీ నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నిర్లక్ష్యంగా కారు నడిపిన రాజేష్ రోడ్డు పక్కన పాలు లోడింగ్ చేస్తున్న శ్రీనివాస్, రాఘవులపై దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్, రాఘవులకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను దగ్గరలోని ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందగా రాఘవులు తీవ్రగాయలతో చికిత్స పొందుతున్నాడు. పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు శ్రీనివాస్ తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకున్నారు.

ముఖ్యమంత్రిగారూ.. ఆదుకోండి

- సమ్మర్ ఉత్సవ్ మేళా నిర్వాహకుడు, 200 కుటుంబాల వేడుకోలు
- పోలీసులు అనుమతించడంలేదని ఆవేదన


సమావేశంలో అన్ని శాఖల అనుమతి పత్రాలను చూపుతున్న సమ్మర్ ఉత్సవ్ మేళా నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్

ఖైరతాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): పర్యాటకంగా గుర్తింపు ఉన్న హుస్సేన్ సాగర్, డాక్టర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం సమీపంలో ఏర్పాటైన సమ్మర్ ఉత్సవ్ మేళాకు నెల రోజులుగా ట్రాఫిక్ పోలీసులు అనుమతి ఇవ్వడం లేదని నిర్వాహకులు వాపోయారు. వేసవిలో కశ్మీర్ అందాల ను ఇక్కడ పరిచయం చేస్తూ హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఫైర్, శాంతి భద్రతల పోలీసులు, ఆర్ అండ్ బీ శాఖలు అనుమతివ్వగా కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసి ఏర్పాటైన ఈ మేళాకు ట్రాఫిక్ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో దాదాపు 200 కుటుంబాలు వీధిన పడ్డాయని వాపోయారు. శుక్రవారం సాయంత్రం మేళా వద్ద జరిగిన విలేకరు ల సమావేశంలో నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్‌తో పాటు అందులో స్టాళ్లు ఏర్పాటు చేసిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తమ గోడును వినిపించారు. హెచ్ఎండీఏ స్థలం అయినందున ప్రతి రోజూ రూ. లక్ష అద్దెతో పాటు జీఎస్టీ కలుపుకొని 60 రోజులకు గాను రూ. 63 లక్షలకు పైగా చెల్లించామని చెప్పారు. మేళాలో కశ్మీర్ అందాలు కనిపించేలా ఏర్పాట్లకు మరో రూ. 50 లక్షల వరకు ఖర్చు అయ్యాయని, హెచ్ఎండీఏ అనుమతి ఇచ్చిన అనంతరం ప్రభుత్వ సంస్థల అనుమతి సైతం లభించిందన్నారు. నెల రోజులుగా కేవలం ట్రాఫిక్ పోలీసు అధికారులు వీఐపీ జోన్ అని, ముఖ్యమంత్రి రూట్ ఉంటుందని అనుమతి ఇవ్వడం లేదని వాపోయారు. నెక్లెస్‌రోడ్‌లో సరైన పార్కింగ్ వసతి లేకున్నా మరో సంస్థకు అనుమతిచ్చిన పోలీసులు 40 శాతం పార్కింగ్ వసతితో పాటు ముఖ్యమంత్రి, వీఐపీల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేస్తామని హామీ లేఖలు ఇచ్చినా.. తమకు అనుమతి ఇవ్వడంలేదని పేర్కొన్నారు. ఈ విషయ మై ముఖ్యమంత్రి, ఇతర ఉన్నాతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సమ్మర్ ఉత్సవ మేళా పేరిట పర్యాటకులను ఆకర్షించేందుకు వినూత్నంగా ఏర్పాటైన ఈ ప్రదర్శనతో నగరానికి మరింత వన్నె వస్తుందని, ఈ విషయమై తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యలే శరణ్యమని నిర్వాహకుడితో పాటు స్టాళ్ల నిర్వాహకులు పేర్కొన్నారు.


మేళా ప్రారంభం కాకపోవడంతో దిగాలుగా కూర్చున్న ఇతర రాష్ట్రాల స్టాళ్ల నిర్వాహకులు

ఐఐసీటీలో నేషనల్ టెక్నాలజీ దినోత్సవం

తార్నాక, మే 17(ఆంధ్రజ్యోతి): నేషనల్ టెక్నాలజీ దినోత్సవ వేడుకలను శుక్రవారం తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ జనరల్ ప్రొ. శిశిర్ సిన్హా ముఖ్య అతిధిగా హాజరయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రొ. శిశిర్ సిన్హా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ ఆన్ ఓవర్ వ్యూ అనే అంశంపై శాస్త్రవేత్తలను ఉద్దేశించి సదస్సులో ప్రసగించారు. భారతదేశం శాస్త్రీయ పురోగతికి చిహ్నంగా జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉందని, మానవుని దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వస్తువు అనివార్యంగా మారిందని అభిప్రాయపడ్డారు. ఎన్విరాన్‌మెంట్, ఎనర్జీ నిలకడగా ఉండేవిదంగా కృషి చేసినట్లయితే ప్లాస్టిక్ వ్యర్థాలను వంద శాతం రికవరీ చేయవచ్చని స్పష్టం చేశారు.

స్నేహితులతో భవనంపై సెల్ఫీ తీసుకుంటూ..

- కిందపడిన యువకుడికి గాయాలు

చాంద్రాయణగుట్ట, మే 17(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగుతుండగా భవనంపై నుంచి కిందపడిన యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఉప్పుగూడ క్రాంతినగర్‌లో జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కందికల్‌గేట్ ప్రాంతానికి చెందిన భాగ్య కుమారుడు నాని(16)శుక్రవారం ఉప్పుగూడ క్రాంతినగర్‌లోవాంబే క్వార్టర్స్‌కి వెళ్లాడు. తన స్నేహితులు అదే క్వార్టర్స్ రెండో అంతస్తులో ఉంటారు. అక్కడికి వెళ్లి వారితో సెల్‌ఫోన్‌లో ఫొటోలు, సెల్ఫీలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. భవనానికి అనుకోని ఉన్న విద్యుత్ కేబుల్‌పై పడడంతో విద్యుత్ స్తంభం విరిగి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మహాలక్ష్మీ హోమం

భెల్‌కాలనీ, మే 17(ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీమహాలక్ష్మీ హోమం నిర్వహించారు. సహస్రనామ సంపుటీకరణ హోమం,మహాలక్ష్మీ అమ్మవారికి- గోదాదేవి ఆలయాల్లో 108కేజీల కుంకుమ, పసుపుతో ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు.

నాలా పనులు త్వరగా చేపట్టాలి

బంజారాహిల్స్, మే 17(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ డివిజన్ ఉదయ్‌నగర్ బస్తీలో నాలా కుంగిపోయింది. ఈ నాలాపై పార్కు చేసిన వాహనాలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. విషయం తెలిసిన ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుంగిపోయిన నాలా పరిసరాలను శుక్రవారం పరిశీలించారు. వెంటనే అధికారులకు ఫోన్ చేసి త్వరగా నాలా పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాలన గాలికొదిలేసి వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు బద్దం మహిపాల్ రెడ్డి, మేచినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఉదయ్‌నగర్ బస్తీలో కూలిపోయిన నాలాను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోకు కట్టుబడి ఉండాలి


బీసీ సంఘాల సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, లాల్‌కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, మే 17(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోకు కట్టుబడి ఉండాలని కోరారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు జరిపితే అడ్డుకుంటామని, గ్రామాల నుంచి తరిమివేస్తామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణల సంయుక్త ఆధ్వర్యంలో 13 బీసీ సంఘాలు, 30 బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారని, దానికి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీల్లో ఏబీసీడీలుగా వర్గీకరించి రిజర్వేషన్లు కల్పించాలని, దీనివల్ల అట్టడుగు కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుత స్థానిక సంస్థల్లో బీసీలకు 20శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని, దీనివల్ల సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీలలో బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కులాల వారీగా లెక్కలు సేకరించిన తర్వాత విద్య ఉద్యోగ రంగాల్లో బీసీ రిజర్వేషన్లను 50శాతం పెంచాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం బీసీలకు 13 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, వాటిని 40కార్పొరేషన్లకు పెంచాలని, ప్రస్తుతం ఉన్న 11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు దానకర్ణచారి, నీల వెంకటేష్, జనార్ధన్, నందగోపాల్, రామకృష్ణ, ఆశీష్‌గౌడ్, అభినవ్ గౌడ్, శ్రీధర్‌గౌడ్, ప్రణీతరాణి, శివమ్మ, రఘుపతి, వినోద్, వేణుగోపాల్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



పంజాగుట్ట, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బానోతు చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఉదయం 6.30 గంటల వరకు 11కేవీ ప్రకాష్ నగర్ ఎక్స్‌టెన్షన్ ఫీడర్ పరిధిలో, ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు 11కేవీ బేగంపేట నాలా, శాంతి బాగ్ ఫీడర్ల పరిధిలోని, ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు 11కేవీ ఆనంద్ బాగ్, శంకర్ లాల్ నగర్ ఫీడర్ల పరిధిలోని, ఉదయం 7.30 గంటల నుంచి ఉదయం 8గంటల వరకు బీఎస్ మక్త, శాంతి శిఖర ఫీడర్ల పరిధిలోని, ఉదయం 8 గంటల నుంచి ఉదయం 8.30గంటల వరకు 11కేవీ సుందర్ నగర్, హెచ్‌పీ రోడ్డు ఫీడర్ల పరిధిలోని, ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 9గంటల వరకు బేగంపేట పోస్టాఫీస్, అవంతినగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలో...

బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఉదయం 6.30 గంటల వరకు 11కేవీ సీఆర్పీఎఫ్ ఫీడర్ పరిధిలో, ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు 11కేవీ నందగిరి హిల్స్ ఫీడర్ పరిధిలో, ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు 11కేవీ ఈ-సేవ ఫీడర్ పరిధిలో, ఉదయం 7.30 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు అన్నపూర్ణ, శబ్దాలయ, యూకో బ్యాంక్ ఫీడర్ల పరిధిలో, ఉదయం 8 గంటల నుంచి ఉదయం 8.30 గంటల వరకు 11కేవీ మధురానగర్, మెరీడియన్ స్కూల్, అశ్విని హైట్స్ ఫీడర్ల పరిధిలో, ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు జయప్రకాష్ నగర్, నాందారి టెంట్ హౌస్, శ్రీచైతన్య స్కూల్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

నేడు వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం

ఖైరతాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యాకా పరమేశ్వరి జయంత్యుత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు హైదరాబాద్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ వాసవీ సేవా కేంద్రాలు ప్రకటించాయి. శుక్రవారం ఆలయంలో విలేకరుల సమావేశంలో సంస్థల అధ్యక్షులు సరాబు లక్ష్మణ్ గుప్తా, కొల్నారు రమేష్, ప్రధాన కార్యదర్శులు కటకం శివకుమార్ గుప్తా, నాచం ప్రభాకర్ మాట్లాడారు. శనివారం వాసవీ సేవా కేంద్రంలో ఉదయం 6 గంటలకు మూల విరాట్‌కు అభిషేకం, 7 గంటలకు 108 కలశాలతో ఖైరతాబాద్ గణపతి నుంచి వాసవీ సేవాకేంద్రం వరకు ఊరేగింపు, అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకం, సహస్రనామాల హోమం, కుంకుమార్చనతో పాటు సాయంత్రం 6గంటలకు ప్రజదాన ఊరేగంపు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వర్షం తెచ్చిన తంటా

నగరంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాలు ఆగమాగమయ్యాయి. శుక్రవారం కూడా వరద కొనసాగింది. రోడ్లపై మురుగునీరు పారింది. రహదారులు గుంతలమయంగా మారాయి.


అమీర్‌పేటలో వరదకు వచ్చిన బురదను తుడుచుకుంటున్న దుకాణదారులు


జేబీఎస్ రోడ్డులో ఇదీ దుస్థితి


అమీర్‌పేటలో రోడ్డుపై చేరిన మురద


దిల్‌సుఖ్‌నగర్‌లో రోడ్డుపై మురుగునీరు

గంట వర్షానికే అస్తవ్యస్తమైన రోడ్లు

- కార్ఖానా పీఎస్ ముందు లోతట్టు ప్రాంతంలో జలమయమైన రాజీవ్ జాతీయ రహదారి
- బురదమయంగా ప్రధాన రహదారులు

మారేడుపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ జాతీయ రహదారిలో గల కార్ఖానా పోలీస్ స్టేషన్ ముందు లోతట్టు ప్రాంతంగా ఉన్న రహదారి గురువారం రాత్రి కురిసిన వర్షానికి వర్షం నీరు రోడ్డు నిండుగా ప్రవహించింది. దీంతో ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రహదారిలో గల వర్షపు నీటి మ్యాన్‌హోల్, డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో వర్షం నీరు అందులో నుంచి సాఫీగా వెళ్ళకపోవడంతో సమస్య జటిలంగా మారింది.

వేసవి కాలంలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో కేవలం గంటసేపు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అవ్వడానికి కారణమయ్యాయి. శుక్రవారం ఉదయం కంటోన్మెంట్ పారిశుధ్య కార్మిక సిబ్బంది వర్షపు నీటి మ్యానువల్‌లలో ఉన్న పూడికతీత పనులను చేపట్టడంతో సమస్యను నివారించారు. అయినప్పటికీ రోడ్డు బురదమయం అయ్యింది.

శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టండి

గుర్తించిన లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కంటోన్మెంట్ స్థానిక బస్తీల ప్రజలు కోరుతున్నారు. కంటోన్మెంట్ పరిధిలోని కార్ఖానా పీఎస్ ముందు రాజీవ్ జాతీయ రహదారి, మారేడుపల్లి ట్రాఫిక్ పీఎస్ సమీపంలోని రాజీవ్ జాతీయ రహదారి, వాసవి నగర్‌లోని పద్మజ కాలనీ, సిరిపురం కాలనీ, గృహలక్ష్మి కాలనీ, లోతట్టు ప్రాంతాలతో పాటు విజయనగర కాలనీ, పికెట్ లక్ష్మీనగర్, కృపానందాల్ నాలా పరిసర ప్రాంతాలు, వెస్ట్ మారేడ్‌పల్లి ప్రధాన రహదారిలో గల ఆగ్రా స్వీట్ హౌస్ పక్కనే ఎత్తయిన ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు వరద ఇక్కడకు చేరుతుంది. కాగా వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా బోర్డు అధికారులు ఏర్పాటు చేసిన ఓపెన్ నాలాలో వెళ్ళకుండా అడ్డుగా గేట్లను ఏర్పాటుచేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీంతో వర్షం నీరు అక్కడ నిలిచి రోడ్లపై నిలుస్తోంది. వర్షపు నీరు నిలిచే లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవలసిన అవసరం కంటోన్మెంట్ బోర్డు అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఓపెన్ భారీ నాలాలలో పూడికతీత పనులను చేపట్టాలని కోరుతున్నారు.

వర్షాలు కురుస్తున్న సమయంలో లోతట్టు ప్రాంతాలలో పర్యటించే అధికారులు, ప్రజాప్రతినిధులు, వర్షాలు కురవని సమయాల్లో లోతట్టుప్రాంతాలను, ప్రమాదకరంగా మారిన నాలాలను గుర్తించి చర్యలు చేపడితే సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు.



కార్ఖానా పీఎస్ ముందు మ్యాన్‌హోల్‌ల నుంచి పూడికతీత పనులు చేపడుతున్న కంటోన్మెంట్ పారిశుధ్య సిబ్బంది



బురదమయంగా మారిన రహదారులు

వర్షం నీటిని తొలిగించిన ట్రాఫిక్ పోలీసులు

తిరుమలగిరి మే 17 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బొల్లారం తోట ముత్యాలమ్మ దేవాలయం వద్ద రాజీవ్ రహదారిపై వర్షం నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్న బస్సులు, భారీ వాహనాలకు దారి తెలియక ఇబ్బందులకు గురయ్యారు. కొందరు వాహనదారులు గుంత ఉన్నదేమోనని భయంతో రాజీవ్ రహదారిపైనే వాహనాలను నిలిపివేశారు. దీంతో పూర్తిగా ట్రాఫిక్ జామ్ అయింది.

విషయం తెలుసుకున్న తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తన సిబ్బందితో కలిసి వెళ్లి రోడ్డు పక్కన వర్షం నీటిని బయటకు పంపించారు. దీంతో వాహనదారులు సాఫీగా వెళ్ళారు.



వెస్ట్ మారేడుపల్లి ప్రధాన మార్గంలో వర్షపు నీరు వెళ్ళడానికి ఏర్పాటు చేసిన గ్రిల్స్ మూసివేత



ఓయూ ఆర్ట్స్ కాలేజీలో డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రారంభిస్తున్న ఓయూ వీసీ డా. రవీందర్ తదితరులు

ఓయూ ఆర్ట్స్ కాలేజీలో డిజిటల్ క్లాస్ రూమ్‌ల ప్రారంభం

తార్నాక, మే 17 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ బోర్డుల ద్వారా విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో పాఠాలు బోధించాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం ఓయూ వీసీ డా.రవీందర్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ మాట్లాడుతూ ఇంజనీరింగ్, టెక్నాలజీ విద్యార్థులతోపాటు ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులకు కూడా డిజిటల్ క్లాసరూమ్‌ల సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో అంతర్జాతీయ స్థాయిలో బోధించేందుకు డిజిటల్ బోర్డులు ఎంతగానో తోడ్పడుతాయని, ఈ అవకాశాన్ని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.అర్జున్ రావు కుతాడి, ఓఎస్డీ ప్రొ. రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మ ఆలయంలో సీసీ టీవీని ప్రారంభిస్తున్న జంపనప్రతాప్, ఆలయ కమిటీ సభ్యులు

ఆలయాల అభివృద్ధికి జంపన సహాయ సహకారాలు

బోయినపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ అన్నారు. కంట టోన్మెంట్ 1వ వార్డు పరిధిలోని బాపూజీనగర్‌లో ముత్యాలమ్మ ఆలయంను పునర్నిర్మాణం చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా నూతనంగా సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, కరణ్ సింగ్, కృష్ణ, రాజు, కొమరయ్య, అజిత్, సన్నిధానం, సంతోష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మర్రి రాంరెడ్డి కాలనీ చైతన్య స్కూల్ ముందు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఎమ్మెల్యే బంధువుల నిర్వాకం కంటోన్మెంట్ ప్రజలకు శాపం

బోయినపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఓ ఎమ్మెల్యే బంధువులు నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లు కంటోన్మెంట్ ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 6వ వార్డులో ఓ ఎమ్మెల్యే బంధువులు అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తున్నారు. దీంతో ఈ చుట్టుపక్కల ఉన్న నాలాలు మురుగుకాలువలు చెత్తచెదారం, ఇసుక, కంకరతో పాటు సిమెంట్ వ్యర్థాలతో మూసుకుపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో చిన్న వర్షం పడిందంటే చాలు ఓల్డ్ బోయినపల్లి ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి పైకివస్తూ కంటోన్మెంట్ ప్రాంతంలోని మర్రి రాంరెడ్డికాలనీ, సీతారాంపురం, చైతన్య స్కూల్, నెల్లూరు పోచమ్మ ఆలయం ప్రాంతాలలో ప్రధాన రోడ్డుపై మురుగు నీరు పరుగుతీస్తోంది. ఈ దారి ఓల్డ్ బోయినపల్లి నుంచి న్యూబోయినపల్లి, బాలానగర్, సికింద్రాబాద్‌లతో పాటు చుట్టుపక్కల ఉన్న సుమారు 6 స్కూల్స్‌కు రాకపోకలు కొనసాగించే ప్రధాన రోడ్డు కావడంతో స్థానికులతోపాటు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. దుర్వాసనతోపాటు రహదారిపై నడిచే పాదచారులకు ఇబ్బందిగా మారింది. గతంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాలువల్లోని మురుగు సమీపంలోని రామన్నకుంటలోకి వచ్చే విధంగా నిర్మించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగు కాలువల్లో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌ల కారణంగానే దుస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో నీరు కుంటలోకి వెళ్లకుండా డ్రైనేజీ పొంగి మురుగు రోడ్డుపై పారుతోంది. ఇప్పటికైనా కంటోన్మెంట్ బోర్డు అధికారులు చొరవతీసుకోవాలని కంటోన్మెంట్ ప్రజలు కోరుతున్నారు.

ఐఐసీటీలో ఘనంగా నేషనల్ టెక్నాలజీ దినోత్సవం

తార్నాక, మే 17 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ టెక్నాలజీ దినోత్సవ వేడుకలను శుక్రవారం తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ జనరల్ ప్రొ.శిశిర్ సిన్హా ముఖ్య అతిథిగా హాజరయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రొ.శిశిర్ సిన్హా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ ఆన్ ఓవర్ వ్యూ అనే అంశంపై శాస్త్రవేత్తలను ఉద్దేశించి సదస్సులో ప్రసంగించారు. భారతదేశం శాస్త్రీయ పురోగతికి చిహ్నంగా జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉందని, మానవుని దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వస్తువు అనివార్యంగా మారిందని అభిప్రాయపడ్డారు. ఎన్వీరాన్‌మెంట్, ఎనర్జీ నిలకడగా ఉండేవిధంగా కృషి చేసినట్లయితే ప్లాస్టిక్ వ్యర్థాలను వంద శాతం రికవరీ చేయవచ్చని స్పష్టం చేశారు.

వర్షం తెచ్చిన తంటా

నగరంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాలు ఆగమాగమయ్యాయి. శుక్రవారం కూడా వరద కొనసాగింది. రోడ్లపై మురుగునీరు పారింది. రహదారులు గుంతలమయంగా మారాయి.



జేబీఎస్ రోడ్డులో ఇదీ దుస్థితి



అమీర్‌పేటలో వరదకు వచ్చిన బురద



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వి.మధుసూదన్‌రెడ్డి

సంస్కృతిని బలోపేతం చేయడమే లక్ష్యం

అల్వాల్, మే 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతిని బలోపేతం చేయడంతో పాటు ఆయా రాష్ట్రాల్లో నివసిస్తున్న ప్రజల మధ్య పరస్పర సంబంధాలను ప్రోత్సహించడమే 'ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో మే 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేషనల్ కెడెట్స్ కార్ప్స్ (ఎన్‌సీసీ) శిక్షణకు 600 మంది ఎన్‌సీసీ కెడెట్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ డైరెక్టరేట్‌ల నుంచి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణలోని వివిధ ఆచారాలు, సాంప్రదాయాలు, భాషను రాజస్థాన్ ఎన్‌సీసీ కెడెట్స్ తెలుసుకోవడానికి దోహదపడుతుందన్నారు. రాజస్థాన్‌లో తాను పనిచేశానని, అక్కడి అనుభవాలను ఆయన కెడెట్స్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్ కమోడోర్ రాజస్థానీ భాషలో కొన్ని వాక్యాలు మాట్లాడటంతో రాజస్థాన్ నుంచి వచ్చిన కెడెట్స్ హర్షం వ్యక్తం చేశారు.



అంబేద్కర్ నగర్‌లో రోడ్డుపైనే సామాగ్రి

అంబేద్కర్‌నగర్‌లో రోడ్డును ఆక్రమించి వ్యాపారం

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ముషీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్‌లో చిరువ్యాపారులు రోడ్లపైనే ప్లాస్టిక్ సంచులను నిల్వ ఉంచి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దీంతో ఆ రోడ్డు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లపైనే తూకం వేసి ఆ సంచులను అక్కడే నిల్వ ఉంచడంతో రోడ్డు ఆక్రమనకు గురికావడంతో పాదచారులు కూడా ఇబ్బందులుపడుతున్నాయి. రోడ్లపై ఉన్న సామగ్రిని తొలగించాలని స్థానికులు చిరు వ్యాపారులకు సూచిస్తే గొడవలకు దిగుతున్నారని వాపోతున్నారు. ఇరుకు రోడ్లపై వ్యాపారం చేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

చర్యలు తీసుకుంటాం : ట్రాఫిక్ సీఐ

రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం తెలిపారు. తమ సిబ్బంది ఆ స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



శశిధర్

అడ్డగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం నగరానికి వచ్చిన ఓ మతిస్థిమితం లేని వ్యక్తి సికింద్రాబాద్‌లో అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. బద్రాచలం, భగవాన్‌దాస్ కాలనీకి చెందిన శశిధర్(30)కు గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగాలేదు. అప్పుడప్పుడు హైద్రాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు తండ్రి చేయించేవాడు. ఈ క్రమంలో ఈనెల 15న వైద్యుల సూచన మేరకు తండ్రి వీరబ్రహ్మం కొడుకు శశిధర్‌కు వైద్య పరీక్షలు చేయించాడు. అనంతరం గచ్చిబౌలికి వెళ్లేందుకు తండ్రీ కొడుకులు ఇద్దరూ బస్టాపులో నిలబడి ఉండగా గచ్చిబౌలికి వెళ్లే బస్సు రావడంతో ముందుగా తండ్రి బస్సెక్కాడు. రద్దీ ఉండడంతో కొడుకు బస్సు ఎక్కాడని అనుకున్నాడు. కానీ బస్సులో కొడుకు కనిపించకపోవడంతో వెతికినా ఫలితం లేకపోయింది. బంధువులు ఇంట్లో వాకబు చేసి, చివరకు గురువారం గోపాలపురం పోలీసులకు తన కొడుకు కనిపించడంలేదని ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు కింద నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి గాలిస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే 8712660247, 8712661249 నెంబరుకు సమాచారం ఇవ్వాలని గోపాలపురం పోలీసులు కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతున్న ఓ వృద్ధుడిని రైలు ఢీకొనడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం - గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని 70ఏళ్ల వృద్ధుడు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వృద్ధుడి ఆచూకీ తెలిస్తే వెంటనే 9712658581 నెంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితులతో భవనంపై సెల్ఫీ తీసుకుంటూ కిందపడిన యువకుడికి గాయాలు

చాంద్రాయణగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగుతుండగా భవనంపై నుంచి కిందపడిన యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఉప్పుగూడ క్రాంతినగర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కందికల్‌గేట్ ప్రాంతానికి చెందిన భాగ్య కుమారుడు నాని(16)శుక్రవారం ఉప్పుగూడ క్రాంతినగర్‌లో వాంబే క్వార్టర్స్‌కి వెళ్లాడు. తన స్నేహితులు అదే క్వార్టర్స్ రెండో అంతస్తులో నివసిస్తారు. అక్కడికి వెళ్లి వారితో సెల్‌ఫోన్‌లో ఫొటోలు, సెల్ఫీలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. భవనానికి అనుకోని ఉన్న విద్యుత్ కేబుల్‌పై పడడంతో విద్యుత్ స్తంభం విరిగి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన పై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

అడ్డగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉండగా మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు మార్చురీకి తరలించారు. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ బోయగూడ రైల్వే క్వార్టర్ పిల్లర్ నెంబరు బి-990 వద్ద గుర్తుతెలియని 50ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వీధి శునకాల స్వైర విహారం

- భయభ్రాంతులకు గురవుతున్న పిల్లలు, మహిళలు

బౌద్ధనగర్, మే17 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లో పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు రోడ్లపై స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా తిరుగుతూ పిల్లలను, మహిళలను, స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రోడ్లపై కుక్కలు మొరుగుతూ పరిగెడుతుంటే ఎవరిమీద దాడి చేయాటానికి వెళ్ళుతున్నాయోనని మహిళలు, వృద్ధులు, పిల్లలు భయపడుతున్నారు. ఇటీవల కాలంలో నగరంలో పలుప్రాంతాల్లో పిల్లలపై వీధికుక్కలు దాడిచేసిన పలు సందర్భాలున్నాయి. కొంతమంది పిల్లలు ప్రాణాలను విడిచిన సంఘటలున్నాయి.

బౌద్ధనగర్ డివిజన్‌లోని వారాసిగూడ పోచమ్మ దేవాలయం వీధి, వారాసిగూడ చౌరస్తా, బౌద్ధనగర్, లలితానగర్ కాలనీ, బ్యాంక్ కాలనీ, జామైఉస్మానియా, పార్శీగుట్ట, సీతాఫల్‌మండి సురేష్ థియేటర్ వద్ద, టీఆర్‌టీ కాలనీ, బీదలబస్తీ, నామాలగుండు, ఇందిరానగర్‌కాలనీ, తదితర ప్రాంతాల్లో ఈ కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఇటీవల కాలంలో వీధి కుక్కల సంఖ్య ఎక్కువగా పెరగటంతో వివిధ పనులు, విధులు ముగించుకుని రాత్రిళ్ళ ఇంటికి వచ్చేవారిని కరుస్తున్నాయి. ద్విచక్ర వాహనాల వెంబడిపడటంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో కుక్కలను పట్టుకుని ఇంజెక్షన్లు ఇచ్చి మరల వాటిని అక్కడే వదిలివేస్తున్నారు. వీధి కుక్కలపై అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే ముందుముందు మరింత ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని పిల్లల తల్లితండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా వీధికుక్కలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

రోడ్లపై కుక్కలు తిరగకుండా చర్యలు చేపట్టాలి



రోడ్లపై కుక్కలు తిరగకుండా అధికారయంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలి. సీతాఫల్‌మండి, మైలార్‌గడ్డ, చిలకలగూడ పరిసర ప్రాంతాల్లో గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు కుక్కలను పట్టుకుని వెళ్లాలి. స్కూల్స్ పరిసర ప్రాంతాల్లో వీధికుక్కలు తిరగకుండా చూడాలి.

దేవా, మైలార్‌గడ్డ,

వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది



వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పగలు, రాత్రుళ్ల తేడా లేకుండా సుమారు పది కుక్కలపైనే గుంపులు, గుంపులుగా వీధుల్లో సంచరించటంతో పిల్లలు, మహిళలు ఎక్కువగా భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రుళ్ల విపరీతంగా మొరగటంతో నిద్రలేకుండాపోతుంది. వీధి కుక్కలను చూస్తుంటే పిల్లలు బెంబేలెత్తిపోతున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది కుక్కలను పట్టుకుని వెళ్లినా యధాతథంగా కుక్కలు తిరుగుతున్నాయి.

టీవీ.కృష్ణ, పోచమ్మఆలయం వీధి, వారాసిగూడ